కిన్నెరసాని నుంచి నీటి విడుదల

పాల్వంచ రూరల్, జూలై 26: కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి శుక్రవారం రాత్రి 5,000 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి వరద నీరు వస్తున్నది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 407 అడుగులు. ఇన్‌ఫ్లో 2,000 క్యూసెక్కులు ఉంది. నీటి మట్టం 402.7 అడుగులకు చేరింది. దీనిని 402 అడుగుల వద్ద స్థిరీకరించేందుకు డ్యామ్ సైట్ అధికారులు ఒక గేటు ద్వారా 5,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేవారు.

బీఈడీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం/బూర్గంపహాడ్, జూలై 26: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక గిరిజన బీఈడీ కాలేజీలో 2024-25, 2025-26 విద్యా సంవత్సరానికి గాను రెండు సంవత్సరాల రెగ్యులర్ బీఈడీ కోర్సులో ప్రవేశానికి షెడ్యూల్ ప్రాంత గిరిజన పట్టభద్రుల నుంచి నేరుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణకు చెందిన అభ్యర్థులు ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన గిరిజన విద్యార్థులు డిగ్రీ పాసై కనీసం 40శాతం మార్కులు సాధించి ఉండాలని, డిగ్రీలో సాధించిన మెరిట్‌ను బట్టి ఎంపిక చేస్తామన్నారు. ప్రభుత్వ నియమాల ప్రకారం మహిళలకు ప్రత్యేక కేటగిరి వారికి సీట్లు రిజర్వు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పూర్తి మెరిట్ ఆధారంగానే ఎంపిక చేస్తామన్నారు. ప్రాస్పెక్టస్, దరఖాస్తులు ఏటూరు నాగారం, ఉట్నూరు, మన్ననూరు, ఐటీడీఏ కార్యాలయాల్లో, గిరిజన బీఈడీ కళాశాల భద్రాచలంలో పొందవచ్చని పీవో తెలిపారు. వివరాల కోసం ప్రిన్సిపాల్ వీరు నాయక్ - 89784877345 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా అడ్మిషన్లు

భద్రాచలం, జూలై 26: అటానమస్ హోదా సాధించిన భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా అడ్మిషన్ పొందేందుకు అవకాశం కల్పించామని కళాశాల ప్రిన్సిపల్ జాన్ మిల్టన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ఫేజ్ ద్వారా విద్యార్థులు ఆగస్టు 2 వరకు దోస్తులో రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు, ఏ కళాశాలలో సీటు పొందనివారు, కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. ఒక కళాశాలలో చేరిన విద్యార్థులు మరోక కళాశాలకు మారాలను కుంటే పాత కళాశాల అడ్మిషన్ రద్దు చేసుకొని కొత్త కళాశాలలో చేరవచ్చన్నారు. సీబీసీఎస్ విద్యా విధానంలో బీఏ, బీకాం, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్ కోర్సుల్లో బకెట్ సిస్టం ద్వారా సబ్జెక్టులకు అవకాశం ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా జరగాలి

డీడీ మణెమ్మకు వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

భద్రాచలం, జూలై 26: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా జరగాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు అన్నారు. బదిలీల్లో ఏ ఒక్క ఉపాధ్యాయుడికి కూడా అన్యాయం జరగకూడదని శుక్రవారం ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీనియార్టీ లిస్ట్‌లో డేట్ ఆఫ్ బర్త్ ప్రకారం లిస్ట్ తయారు చేయడం వల్ల లోపాలు తలెత్తాయని, స్టేషన్ సీనియారిటీ, సర్వీస్ పాయింట్స్ కలిపి ఒకే డీఎస్సీ, ఒకే అపాయింట్‌మెంట్ ఉన్న టీచర్లకు డీఎస్సీ ప్రకారం సీనియారిటీ లిస్ట్ తయారు చేయాలని చెప్పడంతో స్పందించిన డీడీ సీనియారిటీ లిస్టును సవరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ప్రసాదరావు, ఏ రామచంద్, బీ రవి, ఉపాధ్యాయులు బీ రవి, విజయ, శ్రీవాణి, దేవేందర్, లలిత, శివ, కృష్ణ, శ్రీను, రజిత తదితరులు పాల్గొన్నారు.

'చిరు' తిండి.. వండేద్దాం రండి

చిరుధాన్యాల వంటకాలపై శిక్షణ

అశ్వారావుపేట రూరల్, జూలై 26: 'చిరు' తిండి.. వండేద్దాం రండి.. నేర్పిస్తాం రండి.. అంటూ, ఆహ్వానిస్తున్నది వాసన్ సంస్థ. చిరు ధాన్యాల సాగుతోపాటు వాటితో రకరకాల తినుబండారాల తయారీపై మండలంలోని గోగులపూడి గ్రామంలోని కొండరెడ్ల రైతులు, మహిళలకు ఈ సంస్థ శుక్రవారం నాబార్డ్ సహకారంతో స్థానిక కమ్యూనిటీ హాల్‌లో శిక్షణ ఇచ్చింది. కొర్రలతో పులిహోర, సామలతో పాయసం, అరికలతో కిచెడి, రాగులతో జావ, అండుకొర్రలతో పెరుగన్నం తయారీపై సంస్థ ప్రతినిధి ఎం.రాములమ్మ శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత, వారితో ఆ వంటకాలను తయారు చేయించారు. చిరు ధాన్యాల సాగు-దిగుబడి-మార్కెటింగ్‌పై రైతులకు సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. మన తాత ముత్తాల చక్కటి ఆరోగ్య వెనుక అసలు రహస్యం చిరు ధాన్యాల వంటలేనని రాములమ్మ, శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో ఆదివాసీ కొండరెడ్ల సంఘం నాయకులు జి.బాబురెడ్డి, జి.దుర్గారెడ్డి, జి.మంగారెడ్డి, కనకారెడ్డి, సీత, సుభాషిణి, పండమ్మ, లచ్చమ్మ, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో ఫ్రైడే డ్రైడే

భద్రాచలం, జూలై 26: ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే పాటించి, దోమలు అభివృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధిక వర్షాలు, గోదావరి వరదల కారణంగా పీహెచ్‌సీల్లో జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఉన్న ఈడీడీ లిస్ట్ ప్రకారం గర్భిణులను దగ్గరలో ఉన్న పీహెచ్‌సీల్లో కానీ, ఏరియా వైద్యశాలలో కానీ, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో కానీ చేర్పించాలన్నారు. పీహెచ్‌సీల పరిధిలో ఉన్న ముంపు గ్రామాలను గుర్తించి లైన్ డిపార్ట్‌మెంట్ సహకారంతో పునరావాస కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **పాల్వంచ బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **పెరుగు రాంబాబు,** S/o: **పెరుగు వెంకన్న, వయస్సు** : 34 సం||లు, **వృత్తి** : వ్యవసాయం, **నివాసం** : ఇ.నెం. ఇ.నెం. 5-12, బూర్గంపహాడ్ శివారు, టేకులచెరువు గ్రామము, బూర్గంపహాడ్ మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిస్ట్రారు ఖమ్మం, సబ్ రిజిస్ట్రారు వారి ఇలాఖా బూర్గంపహాడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం, టేకులచెరువు గ్రామ పంచాయితీ పరిధిలో చేరిన, బూర్గంపహాడ్ శివారు టేకులచెరువు గ్రామము యందు నేను నీకు దఖలు పర్చిన ఇంటి నెం. 5-12 (పార్ట్) సంబంధించిన ఖాళీ స్థలం మొత్తం వైశాల్యం. 967.92 చ||గ|| / 809.29 చ||మీ||లు, **డాక్యుమెంట్ నెం.** : **128/2024** గల సదరు ఆస్తికి హద్దులు : **తూర్పు** : 14.0 అడుగుల వెడల్పు గల రోడ్డు, **పడమర** : జక్కుల నాగేశ్వరరావు గారి భూమి. **ఉత్తరం** : పెరుగు నవీన్ గారి స్థలం, **దక్షిణం** : మిగతా నా స్వంత ఇల్లు నెం. 5-12.

పలివెల గణేష్ బాబు, అడ్వకేట్, కొత్తగూడెం.
సెల్ : 9849246278

ప్రమాద బీమాపై అవగాహన

మణుగూరు టౌన్, జూలై 26: సింగరేణి కాంట్రాక్ట్ సిబ్బందికి రూ.30 లక్షల ప్రమాద బీమా వర్తింపుపై కాంట్రాక్ట్ ఉద్యోగులకు శుక్రవారం ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అవగాహన కల్పించారు. కాంట్రాక్టు కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు రూ.30లక్షల ఉచిత ప్రమాద బీమా సదుపాయాన్ని వర్తించడం కోసం హెచ్‌డీఎఫ్‌సీ అకౌంట్ కలిగి ఉండాలన్నారు. ఉచిత ప్రమాద బీమాపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు, కాంట్రాక్టర్లు, ప్రిన్సిపల్ ఉద్యోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చండ్రుగొండ: వైద్య శిబిరంలో డాక్టర్ తనూజ, ఎస్సై స్వప్న, ఇల్లెందు రూరల్: మందులు ఇస్తున్న డాక్టర్ లోహిత, కరకగూడెం: నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

అన్నపురెడ్డిపల్లి, జూలై 26: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ పి.స్పందన కోరారు. ఆమె శుక్రవారం అన్నపురెడ్డిపల్లిలో పర్యటించారు. పరిసరాలను పరిశీలించారు. వైద్య సేవల వివరాలను వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక నుంచి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమలు పుట్టకుండా-కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులతో చెప్పారు.

వైద్య శిబిరాలు

చండ్రుగొండ, జూలై 26: మండలంలోని బెండలపాడు గ్రామ శివారులోగల గొత్తికోయల గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కనకం తనూజ నిర్వహించారు. ఎస్సై జి.స్వప్న, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలకగూడెం గ్రామంలో..

అశ్వారావుపేట రూరల్, జూలై 26: మండలంలోని పాలకగూడెం గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని వినాయకపురం పీహెచ్‌సీ డాక్టర్ రాందాస్ నిర్వహించారు. వైద్య సిబ్బంది శ్రీనివాస్, జయ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోటన్న నగర్ గ్రామంలో..

ఇల్లెందు రూరల్, జూలై 26: మండలంలోని కోటన్న నగర్ గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని కొమరారం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత నిర్వహించారు. సబ్ యూనిట్ అధికారి భద్రు, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ సత్యం, హెల్త్ అసిస్టెంట్ బాలాజి, ఏఎన్ఎంలు మంజుల, సావిత్రి పాల్గొన్నారు.

కరకగూడెంలో..

కరకగూడెం, జూలై 26: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి మధు సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కుర్నవల్లి గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి ఆవరణ తొట్లలో ఉన్న నిల్వ నీటిని తొలగించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనగరం ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

దుమ్ముగూడెం, జూలై 26: దుమ్ముగూడెం పీహెచ్‌సీ లక్ష్మీనగరం ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు డాక్టర్ పుల్లారెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఏ గంగాధర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జామే మసీద్ కమిటీ ఎన్నిక

పాల్వంచ, జూలై 26: స్థానిక నటరాజ్ సెంటర్‌లోగల జామే మసీద్ కమిటీని శుక్రవారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా ఎండీ ఫయాజ్ హసన్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఖురేషి, ప్రధాన కార్యదర్శిగా ఇబ్రహీం ఖురేషి ఎన్నికయ్యారు.

కొత్వాలకు సన్మానం

పాల్వంచ రూరల్, జూలై 26: మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన డీసీఎంఎస్ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావును పాలకవర్గం శుక్రవారం కార్యాలయంలో సన్మానించింది. వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ స్వప్న, ఏవో శంకర్, సొసైటీ డైరెక్టర్లు రామమోహన్‌రావు, నారాయణరావు, సీతారాంబాబు, పాపారావు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

దమ్మపేట, జూలై 26: మండలంలోని సీతారామపురం, గణేష్‌పాడు, గుండెపట్వారిగూడెం ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను, కంపాక్స్‌లను సత్తుపల్లికి చెందిన సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు సుధారాణి శుక్రవారం అందజేశారు. పేదవిద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ఈకార్యక్రమం చేపట్టినట్లు ఆమె చెప్పారు.

బిల్డింగ్ వర్కర్ల ధర్నా

కొత్తగూడెం అర్బన్, జూలై 26: తమ అడ్డాల వద్ద షెడ్లు, వాష్ రూమ్‌లు నిర్మించాలని కోరుతూ బిల్డింగ్ వర్కర్లు శుక్రవారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. నాయకులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, పోగుల కోటేశ్వరరావు, సురేంద్రరెడ్డి, రాజేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'లైటింగ్, డెకరేషన్స్, సౌండ్స్' కమిటీ ఎన్నిక

పాల్వంచ, జూలై 26: పాల్వంచ లైటింగ్, డెకరేషన్స్ అండ్ సౌండ్స్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని శుక్రవారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. గౌరవాధ్యక్షుడిగా కత్తి శ్రీనివాసరావు, గౌరవ సలహాదారుగా పెచ్చేటి శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా ఎండీ అన్వర్, వైస్ ప్రెసిడెంట్‌గా అంబటి వెంకట్, సభ్యులుగా కొట్టె రమేష్, నంది వీరభద్రం, కార్తీక్ చౌదరి, కొట్టె ప్రభాకర్, భూక్యా వెంకటేష్ ఎన్నికయ్యారు.

బదిలీ అధికారులు, ఉద్యోగులకు సన్మానం

ఇల్లెందు రూరల్, జూలై 26: బదిలీపై వెళ్తున్న మండల పరిషత్ అధికారులు, ఉద్యోగులు 18 మందిని ఎంపీడీవో ధన్‌సింగ్ శుక్రవారం మండలంలోని సుదిమళ్ల రైతువేదికలో సన్మానించి వీడ్కోలు పలికారు. ఎంపీవో చిరంజీవి, పీఆర్ ఏఈ రాజు, ఏపీవో శంకర్, ఏపీఎం దుర్గారావు, సూపరింటెండెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

చర్ల, జూలై 26: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని చెరువులు కుంటలు నిండాయి. తాలిపేరు ఎడమ కాలువ ఆయకట్టు భూముల్లో చాల వరకు వరినాట్లు పూర్తికావడంతో కుడికాలువ ఆయకట్టు రైతులు చెరువులు, కుంటల కింద వరినాట్లు వేశారు. మండలంలో వరి 17వేల ఎకరాల్లో వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 1,700 ఎకరాల్లో, పత్తి 4,200ఎకరాల్లో వేశారని మండల వ్యవసాయాధికారి శివరాంప్రసాద్ తెలిపారు.

పెదవాగు ప్రాజెక్టుకు మరమ్మతులు ప్రారంభం

మరమ్మతు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట రూరల్, జూలై 26: పెదవాగు ప్రాజెక్టుకు గండి పడిన ప్రదేశంలో తాత్కాలిక ంగా రింగ్‌బండ నిర్మాణ పనులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ మరమ్మతు పనులకు రూ.3.5 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. తాత్కాలికంగా రింగ్‌బండ నిర్మించి, కాల్వల ద్వారా సాగు నీటిని అందిస్తామన్నారు. ఐబీ అధికారులు శ్రీనివాసరెడ్డి, సురేష్‌కుమార్, కృష్ణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చంద్రుగొండ, జూలై 26: మండలంలోని సీతాయిగూడెం, మద్దుకూరు, చంద్రుగొండ, రావికంపాడు, శ్రీరాంపురం, తిప్పనపల్లి గ్రామాల్లోని కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం అందజేశారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, ఎంపీవో ఖాన్, ఆర్ఐ అక్బర్ పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లిలో..

అన్నపురెడ్డిపల్లి, జూలై 26: మండలంలోని వివిధ గ్రామాల్లో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపీడీవో మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.8 లక్షల విలువైన నగలు స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినయ్‌కుమార్

పాల్వంచ, జూలై 26: రూ.8 లక్షల విలువైన నగలను పాల్వంచ పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. సీఐ వినయ్ కుమార్ తెలిపిన వివరాలు.. పాల్వంచ టౌన్ ఎస్సై డి.రాఘవయ్య, సిబ్బంది కలిసి శుక్రవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. శాస్త్రీ రోడ్‌లో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని పట్టుకుని విచారించాడు. తన పేరు చింతల దుర్గాప్రసాద్ అని, విజయవాడ బాంబే కాలనీకి చెందిన వాడినని తెలిపాడు. పాల్వంచలోని శివనగర్.. కాంట్రాక్టర్స్ కాలనీలో మూడు ఇళ్లలో, అయ్యప్ప నగర్‌లోని రెండు ఇళ్లల్లో ఏప్రిల్, మే నెలల్లో వరుసగా చోరీలు చేసినట్లు అతడు బయటపెట్టాడు. జైలులో పరిచయమైన ప్రకాశం జిల్లా చీరాల టౌన్ గుండారల మండలం మామకన్ను గ్రామానికి చెందిన సయ్యద్ ఆల్తాఫ్, పాల్వంచకు చెందిన అందూరి వీరేందర్ సాయంతో ఈ చోరీలు చేసినట్లు వివరించాడు. ఈ చోరీ కేసుల్లో పాల్వంచ పట్టణం వనమా కాలనీకి చెందిన అందూరి వీరేందర్‌ను పాల్వంచ పోలీసులు గత నెలలో పట్టుకున్నారు. ఆ తర్వాత, సయ్యద్ అల్తాఫ్ పట్టుబడ్డాడు. ప్రధాన నింధితుడైన చింతా దుర్గాప్రసాద్ కూడా శుక్రవారం పట్టుబడ్డాడు. అతని నుంచి 55.67 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు కేజీల 155 గ్రాముల వెండి సామగ్రిని స్వాధీనపర్చుకున్నారు. ఖమ్మం, భీమవరంలలో చోరీ చేసిన రెండు బంగారు గొలుసులను కూడా స్వాధీనపర్చుకున్నారు. వీటి విలువ మొత్తం రూ.8లక్షలు ఉంటుంది. ఎస్సై రాఘవయ్యను సీఐ అభినందించారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం నిరసన

సారపాక సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సారపాక, జూలై 26: కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు సారపాక ప్రధాన సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కోటేశ్వరులకు తప్ప సామాన్య ప్రజలకు ఏమాత్రం ఉపయోగంలేదన్నారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉండటంతో పాటు కేంద్రంలో ఇద్దరు మంత్రులుగా ఉన్నా తెలంగాణకు సంబంధించి బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు పాపినేని సరోజిని, ఎస్కే అబీదా, బయ్యా రాము, కనకం వెంకటేశ్వర్లు, చందర్‌రావు, మరియమ్మ, బత్తుల ఏడుకొండలు, వెంకమ్మ, నాగమణి, పద్మ, రజిత, మంజుల, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆరు మొక్కలు

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

చుంచుపల్లి, జూలై 26: ఇంటింటికీ ఆరు మొక్కలను త్వరగా పంపిణీ చేయాలని డీఆర్‌డీవో, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన కోరారు. మండలంలోని త్రీ ఇంక్లైన్ నర్సరీని ఆమె శుక్రవారం సందర్శించారు. పెనగడప నర్సరీని, అంబేద్కర్ నగర్‌లో బండ్ వర్క్‌లను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ.. అర ఎకరంలో 900 డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు నాటిన రైతులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం అందిస్తుందని చెప్పారు. ఎంపీడీవో వీడీవీ అశోక్‌కుమార్, ఎంపీవో గుంటి సత్యనారాయణ, ఈజీఎస్ ఏపీవో రఘుపతి, ఈసీ నాగరాజు, టీఏలు యశ్వంత్, అనీల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ పనుల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి, జూలై 26: మండలంలోని గుంపెన పంచాయతీలో ప్లాంటేషన్ పనులను, నర్సరీలను డీఆర్‌డీవో విద్యాచందన శుక్రవారం పరిశీలించారు. ఎంపీవో షబ్నా, ఏపీవో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి : ఎస్పీ

కేసుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రోహిత్ రాజు

పాల్వంచ రూరల్, జూలై 26: కేసుల పరిష్కారానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. మండలంలోని కిన్నెరసాని రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. రికార్డును పరిశీలించారు. కేసుల వివరాలను తెలుసుకున్నారు. అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డయల్ 100 ఫోన్ రాగానే సత్వరమే స్పందించాలని చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని ప్రజలకు కల్పించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. డీఎస్పీ సతీష్ కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణి'లో ఈఎస్ఐ సేవలకు వినతి

ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎండీ

కొత్తగూడెం సింగరేణి, జూలై 26: తెలంగాణలోని సింగరేణి ఏరియాల్లో కాంట్రాక్ట్ కార్మికు లు, వారి కుటుంబీకుల కోసం ఈఎస్ఐ సేవలను అందించాల ని కోరుతూ ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ కమల్ కిషోర్ సోనును సింగరరేణి సీఎండీ బలరాం కో రారు. ఆయన గురువారం సాయంత్రం ఢిల్లీలో కమల్ కిషోర్‌ను కలిశారు. ఈఎస్ఐ డిస్పెన్సరీలను ఏర్పాటు చేస్తామని, ఆ తర్వాత వాటి ని అవసరం మేరకు ఆస్పత్రులుగా మార్చే అంశాన్ని పరిశీలిస్తామని డైరెక్టర్ జనరల్ హామీ ఇచ్చారు.

రామయ్యకు సర్వాంగ స్వర్ణ కవచాలంకరణ

నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, జూలై 26: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5కోట్లతో తయారు చేయించి, సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచాలను అర్చకులు ధరింపజేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, నిత్యహోమాలు, నిత్య బలిహరణం తదితర నిత్య పూజలను జరిపారు. అనంతరం స్వామివారి నిత్య క ల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామి వారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపిన మహిళలు

రోడ్డు మీద నాట్లు వేస్తున్న మహిళలు

ఆళ్లపల్లి, జూలై 26: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని మర్కోడు పంచాయతీ ఏల్లమ్మతల్లి గుడికి వెళ్లెదారి బురదమయంగా మారింది. గుడికి వెళ్లే మహిళలు, గుడి పరిసరాల్లో నివసించే ప్రజలు కనీసం నడవడానికి వీలు లేకుండా ఉందన్నారు. దీంతో మహిళలు శుక్రవారం రోడ్డుపైనే నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుడికి వెళ్లే దారిలో సీసీ రోడ్డు వేయాలని కోరారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

రామవరం, జూలై 26: స్థానిక ఎస్‌సీబీ నగర్‌లోని మోడ్రన్ ఇఖ్రా స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై మానవ అక్రమ రవాణా నివారణ కొత్తగూడెం అధికారి శ్రీనివాసరావు శుక్రవారం అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్, హెడ్ కానిస్టేబుల్ నాగయ్య, హెచ్ఎం పర్వీన్ సుల్తానా, టీచర్లు నీల, ప్రసన్న, నుసరత్, ఖాజా పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలన

జూలూరుపాడు, జూలై 26: స్థానిక పెండేల భాగ్యమ్మ స్మారక ప్రాథమిక పాఠశాలతోపాటు రేగళ్లతండా, మాచినేనిపేట తండా పాఠశాలల్లో పనులను అమ్మ ఆదర్శ పాఠశాల జిల్లా కోఆర్డినేటర్ సతీష్ శుక్రవారం పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు నేతాజీ, లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ లబ్ధిదారులను కలిసిన డీఏవో

కొత్తగూడెం టౌన్, జూలై 26: సుజాతనగర్ మండలంలోని సర్వారం గ్రామాన్ని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో) బాబురావు శుక్రవారం సందర్శించారు. పంటల రుణ మాఫీ లబ్ధిదారులతో మాట్లాడారున. ఏవో (టెక్నికల్) సాయినారాయణ, మండల వ్యవసాయ అధికారి నర్మద, ఏఈవో ప్రనూష పాల్గొన్నారు.

మున్సిపల్ డీఈగా స్వరూపరాణి

పాల్వంచ, జూలై 26: మున్సిపల్ డీఈగా స్వరూపరాణి శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడి డీఈ మురళి, ఇల్లెందుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిర్మల్ నుంచి స్వరూపరాణి వచ్చారు.

పుట్టింట్లోనే భార్య.. ఉరేసుకున్న భర్త

అశ్వారావుపేట రూరల్, జూలై 26: భార్య కాపురానికి రావడం లేదన్న మనోవేదనతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శివరామకృష్ణ తెలిపిన వివరాలు.. మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన గోళ్ల లక్ష్మణరావు (25) దంపతుల మధ్య మనస్పర్ధలు ఏర్పడ్డాయి. దీంతో ఆమె, తమ ఇద్దరు పిల్లలను తీసుకుని ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి లక్ష్మణరావు ఒంటరిగా ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. మద్యానికి బానిసగా మారాడు. అతడు గురువారం రాత్రి తన ఇంటిలో ఉరివేసుకున్నాడు. పనులకు కలిసి వెళ్లేందుకని తోటి కూలీలు అతడి ఇంటికి శుక్రవారం వెళ్లేసరికి.. ఉరికి వేలాడుతూ కనిపించాడు. వారు చుట్టుపక్కల వారిని పిలిచి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు నాగు ఫిర్యాదుతో కేసును ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ నాయకుడు మృతి

అన్నపురెడ్డిపల్లి, జూలై 26: మండలంలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గుంపెన సొసైటీ మాజీ చైర్మన్ వేముల భాస్కర్‌రావు(64) శుక్రవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మృతదేహాన్ని నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

ద్విచక్ర వాహనాలు సీజ్

సీజ్ చేసిన వాహనాలతో ఎస్సై రాణాప్రతాప్

జూలూరుపాడు, జూలై 26: తగిన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై రాణాప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం జూలూరుపాడులో వాహనాలను తనిఖీ చేవారు. ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొందరు ఆ పత్రాలను ఇళ్ల నుంచి తీసుకొచ్చి తమ వాహనాలను తీసుకెళ్లారు. మిగిలిన 30 ద్విచక్ర వాహనాలు స్టేషన్‌లోనే ఉన్నాయి.

విద్యార్థి అదృశ్యంపై విచారణ

ఇల్లెందు రూరల్, జూలై 26: విద్యార్థి అదృశ్యంపై బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మి శుక్రవారం విచారణ చేపట్టారు. ఇల్లెందు బీసీ హాస్టల్‌లో ఉంటూ జవహర్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న తనీష్, బుధవారం ఉదయం టిఫిన్ చేసి స్కూల్‌కు బయల్దేరాడు. ఆ తర్వాత హాస్టల్‌కు రాలేదు. అతడి తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. బస్టాండ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. తనీష్ హైదరాబాద్‌లో ఉన్నాడన్న సమాచారంతో అక్కడకు హాస్టల్ వార్డెన్, పోలీసులు వెళ్లారు.

లారీ ఢీకొని మేకలు మృతి

దమ్మపేట, జూలై 26: రోడ్డు దాటుతున్న మేకలను లారీ ఢీకొంది. 12 మేకలు మృతిచెందాయి. మందలపల్లి క్రాస్ రోడ్డులో ఇది శుక్రవారం జరిగింది. మేగడ వెంకటేశ్వరరావు, తన మేకలను శుక్రవారం రోడ్డు దాటిస్తుండగా సత్తుపల్లి వైపు వేగంగా వెళ్తున్న లారీ ఢీకొట్టింది. 12 మేకలు మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.1.4 లక్షలు ఉంటుందని అతడు తెలిపాడు.

వణుకుడు 'రోగం'తో పశువులు మృతి

టేకులపల్లి, జూలై 26: వణుకుడు రోగం..! ఎప్పుడూ వినని-చూడని ఈ జబ్బు.. పశువులను చంపేస్తున్నది. బాధితులు తెలిపిన వివరాలు.. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన పశువుల కాపరులు జబ్బ నర్సయ్య, చింత కన్నయ్య; మేకల కాపరులైన మడే భద్రం, కొర్స వీరస్వామి కలిసి గురువారం ఉదయం కోయగూడెం ఉపరితల గని వైపు వెళ్లారు. పశువులు, మేకలు అక్కడి కోల్ బంకర్ వద్ద మేత మేస్తున్నాయి. మధ్యాహ్నం 3.00 గంటల సమయంలో మూడు పశువులు, నాలుగు మేకలు గజ గజ వణుకుతూ అక్కడికక్కడే చనిపోయాయి. వారు శుక్రవారం తమ గ్రామస్తులతోపాటు సింగరేణి అధికారులను కలిశారు. బంకర్ వద్దనున్న పచ్చిక కలుషితం/విషపూరితం అయిన కారణంగానే పశువులు, మేకలు చనిపోయాయని వాదించారు. దీంతో, సింగరేణి అధికారులకు-గ్రామస్తులకు మధ్య వాగ్వివాదం జరిగింది. స్థానిక నాయకుడు కోరం సురేందర్ జోక్యం చేసుకుని శాంతింపజేశారు. పది రోజుల్లో పరిహారం వచ్చేలా చూస్తానంటూ ఆ గ్రామస్తులతో చెప్పారు. ఆ తర్వాత, ఎస్‌వో టు జీఎం మల్లయ్యకు బాధితులు వినతిపత్రం ఇచ్చారు.

వీధి కుక్కల పట్టివేత

పాల్వంచ, జూలై 26: పట్టణంలోని బాపూజీనగర్ ఏరియాలో స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలను మున్సిపల్ సిబ్బంది శుక్రవారం బంధించారు. వాటిని కొత్తగూడెంలోని జంతు సంరక్షణ కేంద్రానికి తరలించారు.